అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



సత్య దీపిక

ఉదయం

తెలుగు దినపత్రిక



ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 130 | మంగళవారం 16-11-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00

- తుపాను ముప్పుపై ఏపీసీపీడీసీఎల్ అప్రమత్తం
- విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు
- లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపునకు ఆదేశాలు
- వాలిన స్తంభాల మరమ్మతులు.. వదులుగా ఉన్న వైర్ల బిగింపు
- ప్రతి సబ్ డివిజన్‌లో అదనపు విద్యుత్ స్తంభాల నిల్వ
- పోల్ డిగ్గర్లు, జేసీబీలతో సహాయక బృందాలు సిద్ధంలిలి
- తుపాను ప్రభావం తగ్గేవరకు విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు
- అంతరాయం ఏర్పడితే వెంటనే సరఫరా పునరుద్ధరణకు ఆదేశాలు
- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణకు సీఎండీ సూచనలు

బంగాళాఖాతంలో 'అక్వాన్' తుపాను



విశాఖపట్నం:**సత్యదీపిక ఉదయం**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా బలపడింది. దీనికి ఇప్పటికే 'అక్వాన్'గా నామకరణం చేశారు. ప్రస్తుతం గంటకు 10 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న ఈ తుపాను రేపు సాయంత్రానికి తీవ్ర తుపానుగా, గురువారం ఉదయానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.అయితే ఈ తుపాను శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు--తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం దాటే సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 18004250101 నంబర్లను సంప్రదించాలని, సమస్యల పరిష్కారం కోసం 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009కు సమాచారం అందించాలని కోరారు.

రొయ్య రైతుల పేరుతో జగన్‌ది కపట ప్రేమ

- రైతుల కష్టాలను రాజకీయాలకు వాడుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
- తుఫాను బాధిత ఆక్వా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- 1,071 మంది రైతులకు చెందిన 1,720.90 హెక్టార్లలో పంట నష్టం గుర్తింపు
- రూ.3.96 కోట్ల పరిహార ప్రతిపాదనలు కేంద్రానికి పంపించాం
- 75 వేల ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు రూ.1,300 కోట్ల రాయితీ
- అర్హులైన ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే సరఫరా
- అంతర్జాతీయ మార్కెట్ ధరల హెచ్చుతగ్గులకు ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం సరికాదు
- రైతులకు మెరుగైన ధరలు, సాగు వ్యయం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
- అసత్య ప్రచారాలతో రైతుల్లో భయాందోళనలు సృష్టించవద్దు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

-రైతుల కష్టాలను రాజకీయాలకు వాడుకోవడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

-తుఫాను బాధిత ఆక్వా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి, **సత్యదీపిక ఉదయం**రొయ్య రైతులపై కపట ప్రేమ ఒలకబోస్తూ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారానికి తెరలేపారని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. ఆర్నాబ్, మురసు తుఫానులతో 1,071 మంది ఆక్వా రైతులకు చెందిన 1,720.90 హెక్టార్లలో నష్టాన్ని గుర్తించి, ఎన్డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.3.96 కోట్ల నష్టం అంచనా వేసి కేంద్రానికి పరిహార ప్రతిపాదనలు పంపామని తెలిపారు. తుఫానులకు ముందే రైతులను అప్రమత్తం చేసి నష్టనివారణ చర్యలు చేపట్టామని, ఇన్ని చర్యలు తీసుకుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సాక్షి ఎలా రాస్తుందని ప్రశ్నించారు.గత ప్రభుత్వ హయాంలో 100 కౌంట్ రొయ్యల ధర కిలో రూ.200 నుంచి రూ.210 పరిధిలో ఉండగా, ఈ ఏడాది సెప్టెంబర్‌లో రూ.280కి చేరిన విషయం జగన్‌కు, సాక్షికి కనిపించలేదా అని మంత్రి నిలదీశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్, సరఫరా, ఎగుమతుల పరిస్థితులతో ధరల్లో హెచ్చుతగ్గులు వస్తాయని, ప్రపంచ మార్కెట్ పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వాన్ని బాధ్యులను చేయడం రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శన మన్నారు. రైతులకు మెరుగైన ధరలు అందించేందుకు ఫార్మ్‌గేట్ ప్రైస్ మానిటరింగ్ కమిటీ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నామని, మేత ధరలపై ప్రతి 45 రోజులకు రైతు సంఘాలు, కంపెనీలతో సమీక్షిస్తున్నామని తెలిపారు.





జగన్ అండ్ కో అవినీతి, అక్రమాలపై వెబ్‌సిరీస్ తీస్తే అంతం ఉండదు: మంత్రి

3లో

సమాజంలోని ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

చేయూత పింఛన్లతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా
అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు
రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



సంగారెడ్డి **సత్యదీపిక ఉదయం**

-సమాజంలోని ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేయూత పింఛన్లను
మంజూరు చేస్తోందని తెలిపారు.సోమవారం అందోల్ మండలం సంగుపేట ఎక్స్ రోడ్డులోని శ్రీలక్ష్మీదేవి గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తెలంగాణలో విద్యుత్ కోతలు ఉండొద్దు..

- విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా నిరంతర సరఫరా ఉండాలి
- రబీ సీజన్‌లో రైతులు, ప్రజలకు 24 గంటల విద్యుత్ అందించాలి
- ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు
- అక్టోబర్ 16న రికార్డు స్థాయిలో 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్
- గతేడాది నవంబర్‌తో పోలిస్తే గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం
- జలవిద్యుత్ ఉత్పత్తిలో 4,000 మెగావాట్ల కొరత



హైదరాబాద్,**సత్యదీపిక ఉదయం**

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో రైతులు, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.అక్టోబర్ 16న రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైందని, వరుసగా రెండో రోజు కూడా 20,003 మెగావాట్ల డిమాండ్ వచ్చినట్లు తెలిపారు. గతేడాది నవంబర్ 16న 8,522 మెగావాట్లుగా ఉన్న డిమాండ్ ఈ ఏడాది 12,802 మెగావాట్లకు పెరిగిందన్నారు. చారిత్రాత్మక స్థాయిలో డిమాండ్ పెరిగినప్పటికీ సమర్థంగా విద్యుత్ సరఫరా చేసిన అధికారులను అభినందించారు.

వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో 4,000 మెగావాట్ల కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. అవసరమైన విద్యుత్‌ను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు.

చెరువుల్లో, నాలాల బఫర్ జోన్లలో యథేచ్ఛగా నిర్మాణాలు!

- హైడ్రా ప్రజావాణికి 54 ఫిర్యాదులు.. ఆక్రమణలపై చర్యలకు కమిషనర్ ఆదేశాలు
- గాజులరామారం, శంబీపూర్, మల్లంపేట చెరువుల పరిరక్షణకు వినతులు



హైదరాబాద్, **సత్యదీపిక ఉదయం**

నగరంలో చెరువులు, నాలాలు, వరద కాలువల ఆక్రమణలు కొనసాగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడుతూ క్రమంగా ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకెళ్తున్నారని, దీంతో జలవనరులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హైడ్రా ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా చెరువుల హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణికి మొత్తం 54 ఫిర్యాదులు అందాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. గూగుల్, శాటిలైట్ చిత్రాలను పరిశీలించి సమస్యల పరిష్కార బాధ్యతలను సంబంధిత
అధికారులకు అప్పగించారు. చెరువులు, నాలాల ఆక్రమణలతో పాటు వరద కాలువలను సైతం ఆక్రమిస్తున్నారని, ఫలితంగా వర్షాకాలంలో తమ నివాస ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు కొత్త డీజీ..

బాధ్యతలు చేపట్టిన సౌమ్య మిశ్రా



హైదరాబాద్, నవంబరు 16 ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈరోజు (సోమవారం) హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని మహిళా భద్రతా విభాగం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణ, సాధికారతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. స్త్రీల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. కమ్యూనిటీ భాగస్వామ్యం, జెండర్ సెన్సిటైజేషన్‌పై దృష్టిసారిస్తామని వెల్లడించారు.
మహిళలపై హింస, వేధింపుల నివారణకు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న మహిళా భద్రతా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. మహిళలు, చిన్నారులు గౌరవంగా, భద్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించే సమాజ నిర్మాణానికి కృషి చేస్తానని సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు ప్రత్యేక ఏర్పాట్లు.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



విజయవాడ, నవంబర్ 16: ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో 50 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, ఆయా గ్రామాల్లో పోలీసులతో కవాతు నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడారు. 'ఎన్టీఆర్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు.. 3,280 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల విధుల్లో 9,700 మంది సిబ్బంది పాల్గొంటారు. మొదటి విడతలో నందిగామ, జగ్గయ్యపేటలో ఎన్నికలు నిర్వహించగా.. రెండో విడతలో తిరువూర్ ప్రాంతంలో ఎన్నికలను నిర్వహిస్తాం. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా 50 సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ఆయా గ్రామాల్లో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశాం. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ముందుగానే చర్యలు చేపట్టాం. సర్పంచ్ ఎన్నికలకు పింక్ కలర్ బ్యాలెట్ పేపర్‌ను నిర్ణయించగా.. వార్డు సభ్యుల ఎన్నికలకు వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ ఉంటుంది' అని కలెక్టర్ పేర్కొన్నారు

అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్‌కు సోషల్ మీడియాలో బెదిరింపులు



ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్‌కు సోషల్ మీడియాలో బెదిరింపులు ఎదురయ్యాయి. బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు మిమ్మల్ని కాపాడలేవంటూ గోల్డీ ధిల్లాన్ పేరిట సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్టు ప్రత్యక్షమైంది. ముంబైలో అమితాబ్‌ను టార్గెట్ చేసిన ఇద్దరు నిందితులను ధిల్లీ పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో ఈ పోస్టు ప్రస్తుతం కలకలం రేపుతున్నాయి. అయితే, ఈ పోస్టు గోల్డీ ధిల్లాన్ పెట్టాడా? లేదా? అన్నది పూర్తిస్థాయిలో నిర్ధారణ కావాల్సి ఉంది.వికాస్ ఠాకూర్, దీపక్ సింగ్‌లను అరెస్టు చేసినంత మాత్రాన తమ ప్లాన్‌పై ఎలాంటి ప్రభావం పడదనే హెచ్చరికలు ఆ పోస్టులో ఉన్నాయి. తమ గ్యాంగ్‌కు చెందిన 200 మంది ఇంకా ముంబైలో క్రియాశీలకంగానే ఉన్నారన్న వార్నింగ్ కనిపించింది. సిక్కు మతస్తులకు వ్యతిరేకంగా మాట్లాడే వారికి ఆ పోస్టులో గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అమితాబ్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్‌ల పేర్లను ప్రత్యేకంగా పేర్కొన్నారు. బుల్లెట్ ప్రూఫ్ అద్దాలు కూడా కాపాడలేవని హెచ్చరించారు. పోస్టులో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల ప్రస్తావన కూడా ఉంది. నాటి హింసకు కారణమైన వారిని క్షమించే ప్రసక్తే లేదని నిందితులు హెచ్చరించారు. 'వాళ్లు ఎన్ని బుల్లెట్ ప్రూఫ్ గదులను నిర్మించుకున్నా కాల్చిపారేస్తాం' అన్న వార్నింగ్ కలకలం రేపుతోంది.గత నెలలో ముంబైలోని అమితాబ్ ఇంటిని టార్గెట్ చేస్తూ మూడు ఈమెయిల్స్ వచ్చాయి. బాంబులతో పేల్చేస్తామంటూ నిందితులు బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలో శనివారం ధిల్లీ పోలీసులు బిష్ణోయ్‌గ్యాంగ్‌కు చెందిన వికాస్ ఠాకూర్, దీపక్ సింగ్ అనే షూటర్లను అదుపులోకి తీసుకున్నారు. అమితాబ్ బచ్చన్‌తో పాటు ధిల్లీకి చెందిన ఓ వ్యాపారిని వారు టార్గెట్ చేసుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పటికే అమితాబ్ బచ్చన్ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

అండాల అక్రమ సేకరణ కేసు..





హైదరాబాద్, నవంబరు 16
కొంతమంది మహిళల నుంచి అండాలను అక్రమంగా సేకరించిన కేసులో సంచలన విషయాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. ఈ కేసులో మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో నమోదైన మూడు కేసుల ఆధారంగా దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఈరోజు (సోమవారం) మల్కాజ్‌గిరిలోని తన కార్యాలయంలో మీడియాతో సీపీ సుమతీ మాట్లాడారు. అండాల సేకరణ కేసులో బాధితులకు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించామని చెప్పుకొచ్చారు. కోర్టు అనుమతి ఇస్తే వాళ్ల స్టేట్‌మెంట్లు రికార్డు చేసి తదుపరి విచారణకు ముందుకెళ్తామని పేర్కొన్నారు. బాధితులు ఇచ్చే స్టేట్‌మెంట్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే జిల్లా వైద్యశాఖ అధికారులతో కలిసి పని చేస్తున్నామని అన్నారు. బాధితులకు, ఆస్పత్రులకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.
24 ఫెర్టిలిటీ సెంటర్లకు నోటీసులు ఇచ్చామని, 17 ఫెర్టిలిటీ సెంటర్లతో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లుగా తమ దర్యాప్తులో తేలిందని సీపీ సుమతీ పేర్కొన్నారు. కస్టడీలోకి తీసుకున్న నిందితులను వేర్వేరుగా ఉంచి విచారించామని చెప్పారు. నిందితుడు ప్రవీణ్ 120 నకిలీ ఆధార్ కార్డులను తయారు చేసినట్లుగా గుర్తించామన్నారు. కస్టడీ విచారణలో నిందితుల నుంచి పలు కీలక విషయాలను రాబట్టామని తెలిపారు. ఏజెంట్లు, డోనర్లు రిక్రూట్‌మెంట్ ఏ విధంగా చేస్తారనే విషయాలను నిందితుల నుంచి సేకరించామని చెప్పారు. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ఏఆర్టీ ఫెర్టిలిటీ, పలు ఐవీఎఫ్ సెంటర్లు రూల్స్ ఫాలో కాలేదనే విషయాన్ని గుర్తించామని అన్నారు.
ఈ కేసులో ఎవరినీ వదలిపెట్టేది లేదు..
డాక్యుమెంట్ ఫ్యాబ్రికేషన్‌పైన దృష్టి పెడతామని సీపీ సుమతీ తెలిపారు. బాధితుల్లో రిపీటెడ్ డోనరులను గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కేసులో ఎవరినీ వదలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. నిందితుల బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలించామని తెలిపారు. బాధితుల రిక్రూట్‌మెంట్ హైదరాబాద్ కేంద్రంగా జరిగిందా, ఇతర రాష్ట్రాల్లో జరిగిందా..? అనే విషయాలను దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. ఏఆర్టీ సెంటర్ల లైసెన్సులు ఏ రాష్ట్రంలో రిజిస్టర్ అయి ఉన్నాయనే విషయంపై తాము దర్యాప్తు చేస్తున్నామని సీపీ సుమతీ పేర్కొన్నారు.

జగన్ అండ్ కో అవినీతి, అక్రమాలపై వెబ్‌సిరీస్ తీస్తే అంతం ఉండదు: మంత్రి



అమరావతి, నవంబరు 16):: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కో అవినీతి, అక్రమాలపై వెబ్‌సిరీస్ తీస్తే దానికి అంతం ఉండదని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డితో పాటు ఆయన చుట్టూ ఉన్న వారి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతోందని పేర్కొన్నారు. గతంలో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని సూట్‌కేస్ కంపెనీలను ఆయన సృష్టించారని ధ్వజమెత్తారు. ఈరోజు (సోమవారం) అమరావతి వేదికగా మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు.

గతంలో సీఎంవోలో కీలకంగా పనిచేసిన వ్యక్తుల వద్ద రూ.వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి..? అని ప్రశ్నించారు.కేవలం రూ.2 లక్షల జీతం తీసుకునే వారికి భార్యలు, బంధువుల పేరున వందల కోట్ల ఆస్తులు ఎక్కడివి..? అని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. టిఫిన్ బండి నడిపిన వ్యక్తికి రూ.వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలు గమనించాలని అన్నారు. మద్యం, మైనింగ్, భూముల దోపిడీ ద్వారా ప్రజాధనాన్ని విదేశాలకు జగన్ అండ్ కో తరలించారని ఆరోపించారు. దోచుకున్న సొమ్మును సౌతాఫ్రికా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, మలేషియా దేశాల్లో పెట్టుబడులుగా పెట్టారని మండిపడ్డారు. విదేశాలకు తరలించిన డబ్బును సాఫ్ట్‌వేర్ కంపెనీల పేరుతో మళ్లీ వెనక్కు తెచ్చుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదు..'జే బ్రాండ్స్' మద్యంతో 30 వేల మంది ఆడబిడ్డల తాళిబొట్లును తెంపారని మంత్రి దుయ్యబట్టారు. నాసిరకం మద్యం వల్ల కిడ్నీ, లివర్ వ్యాధులతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని చెప్పుకొచ్చారు. సొంత తల్లిని, చెల్లిని జగన్ ఇంట్లోంచి పంపేశారని ఆగ్రహించారు. గతంలో ఓబులాపురం గనుల విషయంలో తాము చెప్పినట్లుగానే నేడు జడ్జిమెంట్ వచ్చిందని ప్రస్తావించారు. ప్రజల ఆగ్రహం వల్లే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు..

సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీ

ఢిల్లీ, నవంబర్ 16: దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు జరిగాయని, భారీ ఎత్తున ఓట్లను తొలగించారని ఆరోపిస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర విపక్ష నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘానికి 48 రాతపూర్వక ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వారు అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా పిటిషన్ దాఖలు చేశారు.పిటిషనర్ల ఆరోపణ: ప్రధాన ఎన్నికల కమిషనర్ మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషిల ప్రమేయం లేకుండానే కమిషన్‌కు ఉన్న ఉమ్మడి అధికారాలను ఏకపక్షంగా వినియోగించారా అన్నదే ఈ వివాదంలో కీలకమని రాహుల్ గాంధీ తదితరులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ముగ్గురు కమిషనర్లు స్వయంగా ప్రమాణపత్రాలుదాఖలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈసీఐ వాదన: అక్టోబర్ 26న, తిరిగి నవంబర్ 14న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భాను ప్రకాశ్ ఏటూరు ద్వారా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లలో.. ముగ్గురు సభ్యుల కమిషన్ ఏకగ్రీవ నిర్ణయం మేరకే ూ×= ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. విపక్షాల కౌంటర్: ఈసీఐ కేవలం మాటల ద్వారానే వాదిస్తోందని, తమ వాదనకు మద్దతుగా కనీసం ఫైల్ నంబర్లు, తేదీలు, సమావేశపు మినిట్స్ వంటి అధికారిక రికార్డులను బయటపెట్టడం లేదని పిటిషనర్లు విమర్శించారు. పైగా, దేశవ్యాప్త ూ×= నిర్వహణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆగస్టు 2025లో ఈసీఐ అధికారులే స్వయంగా ఒక సమాచార హక్కుదరఖాస్తుకు బదులిచ్చిన విషయాన్ని వారు కోర్టు దృష్టికి తెచ్చారు.
సుప్రీంకోర్టు నిబంధనలు-2013 ప్రకారం పది విభాగాల్లో మొత్తం 48 ప్రశ్నలను ఈసీఐకి సంధించేందుకు పిటిషనర్లు అనుమతి కోరారు. అందులో ప్రధానమైనవి:కమిషనర్ల అభ్యంతరాలు: ఫిబ్రవరి 2025 నుంచి అక్టోబర్ 2026 మధ్య కాలంలో ఫారం-6 (ఖీశీతీఎ 6), లేదా కోర్టు అప్పీళ్ల విషయంలో ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి ఏవైనా రాతపూర్వక అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు నమోదు చేశారా? అన్న వివరాలను వెల్లడించాలని కోరారు.డేటాబేస్ యాక్సెస్, తొలగింపులు: ఓటర్ల జాబితా డేటాబేస్‌లో మార్పులు చేసే అవకాశం ప్రైవేట్ కాంట్రాక్టర్లు లేదా వెండర్లకు ఉందా? ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లఉత్తర్వులు లేకుండానే సామూహికంగా ఓట్ల తొలగింపు జరిగిందా? యాక్సెస్ ఆడిట్ నిర్వహించాలన్న డాక్టర్ వివేక్ జోషి



ప్రతిపాదనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న విషయాలపై ఈసీఐ డైరెక్టర్ జనరల్ (ఐటీ) స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.వాట్సాప్ ఆమోదాలు.. రాష్ట్రాల వారీ డేటా: ఆన్‌లైన్ ఫారం-6లో కొత్త డిక్లరేషన్ చేర్చడానికి ఎవరు అనుమతించారు? ముసాయిదా, తుది జాబితాల నుంచి తొలగించిన ఓటర్ల రాష్ట్రాల వారీ డేటా ఏమిటి? అత్యవసర ఆమోదాలను వాట్సాప్ లేదా వ్యక్తిగత ఇమెయిళ్ల ద్వారా పొందారా? అన్న వివరాలను అడిగారు.
పుట్టస్వామి తీర్పు ప్రస్తావన
ఒక సాంకేతిక వ్యవస్థను నిర్వహిస్తున్న సంస్థ వద్ద మాత్రమే ఉండే కీలక వాస్తవాలు రాజ్యాంగపరమైన సవాలుకు కేంద్రబిందువుగా మారినప్పుడు, ఆ అధికారులను నిర్దిష్ట ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కోర్టు ఆదేశించవచ్చంటూ గతంలో జస్టిస్ కె.ఎస్. పుట్టస్వామి కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పిటిషనర్లు ఉదహరించారు.

అప్పు చెల్లించలేదని తల్లిని, ఆరు నెలల బిడ్డను ఎత్తుకెళ్లిన వడ్డీ వ్యాపారి..!



తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదనే కారణంతో ఓ వడ్డీ వ్యాపారి.. మహిళను, ఆమె ఆరు నెలల పసిబిడ్డను ఎత్తుకపోయిండు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొట్టంబేడు మండలం శివనాథపాలెం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన ఆ రాష్ట్రంలో రాజకీయ వివాదానికి దారితీసింది. ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ ఘటనపై పోలీసుల స్పందనను, టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రశ్నించింది.బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఏడు నెలల క్రితం ఆది, అతని భార్య మేఘమాల శ్రీకాళహస్తికి చెందిన వెంకటగిరి మునెమ్మ, ప్రసాద్, మోహన్ అనే వ్యక్తుల దగ్గర రూ. 1.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ అప్పు కోసం నెలకు నూటికి రూ. 5 వడ్డీ చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే వారు అసలును, వడ్డీని సకాలంలో చెల్లించలేకపోయారు. దాంతో నవంబర్ 11న ఆది ఇంట్లో లేని సమయంలో ప్రసాద్, అతని కుమారుడు మోహన్ ఆది ఇంటికి వెళ్లారు.వారికి బకాయిపడిన డబ్బు కోసం మేఘమాలను, ఆమె ఆరు నెలల పసిబిడ్డను తమతోపాటు తీసుకుపోయారు. దాంతో మేఘమాల కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల జోక్యంతో తల్లి, బిడ్డ సురక్షితంగా ఇంటికి తిరిగి వచ్చారు. శనివారం తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో శ్రీకాళహస్తి డీఎస్పీ పావని ఈ ఘటనపై స్పష్టత ఇచ్చారు. మేఘమాల ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదులో వడ్డీ చెల్లించాలని ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారే తప్ప, తమను బలవంతంగా తీసుకెళ్లారని లేదా బంధించారని ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు స్టేషన్ నోటీస్ జారీచేసి కేసు నమోదు చేయడానికి స్థానిక కోర్టు నుంచి అనుమతి కోరారని డీఎస్పీ తెలిపారు. నవంబర్ 13న తొట్టంబేడు సబ్-ఇన్‌స్పెక్టర్ జారీ చేసిన నోటీసులో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 174 కింద విచారణ చేపట్టనున్నట్లు కూడా పేర్కొన్నారు. కోర్టు అనుమతి లభిస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు. దాడికి పాల్పడినట్లు వచ్చిన మరో ఫిర్యాదుపై కూడా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పావని తెలిపారు.

ఇదిలావుంటే.. ప్రజలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. డబ్బు వసూలు చేయడానికి పసికందును ఇంటి నుంచి తీసుకెళ్లడం ఏమిటని, దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆ పార్టీ ప్రశ్నించింది. జవాబుదారీతనం ఉండాలని, బలవంతపు రుణ వసూళ్లను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

కొత్తపేట గ్రంథాలయంలో ఉద్యమకారుల సంస్మరణ దినోత్సవం



కొత్తపేట, నవంబర్16.
(సత్య దీపిక ఉదయం ప్రతినిధి)
కొత్తపేట ద్వితీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ కారుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు ఎస్సార్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఏర్పాటుకు వారు చేసిన కృషిని కొనియాడారు. వారి కృషి ఫలితంగా నేడు గ్రంథాలయాలు ఎంతోమంది విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతున్నాయని వక్తలు పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కుంచే సునీత, పాఠకులు నిమ్మల రామకృష్ణ, నల్లా లక్ష్మణ్, శీలం వెంకన్న బాబు, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు సలాది శేషావతారం పాల్గొన్నారు.

యెంట్రుకోన గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా చుట్టుగుల్ల శాంతకుమారి సత్యనారాయణ నామినేషన్ దాఖలు



అల్లవరం, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేకరి) :అల్లవరం మండలం యెంట్రుకోన గ్రామ సర్పంచ్ పదవికి అభ్యర్థిగా చుట్టుగుల్ల శాంతకుమారి సత్యనారాయణ సోమవారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆమెకు తమ మద్దతు ప్రకటిస్తూ, ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.యెంట్రుకోన గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన శాంతకుమారి సత్యనారాయణ గారికి గ్రామ ప్రజల ఆశీస్సులు, మద్దతు లభించాలని పలువురు ఆకాంక్షించారు.

చోడవరం మండలంలో గ్రామ పంచాయతీల నామినేషన్ కేంద్రాలను సందర్శించిన అనకాపల్లి ఎస్డిపిఓ



అనకాపల్లి నవంబర్ :16(సత్య దీపిక ఉదయం బ్యూరో)గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, అనకా పల్లి ఎస్డిపిఓ.పివివి నరసిం హారావు చోడవరం మండలంలోని ఖండేపల్లి మరియు వెంకన్నపాలెం గ్రామ పంచాయతీల నామినేషన్ కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను, నామినేషన్ కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసు అధికారులు మరియు సిబ్బందికి తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో చోడవరంపి.సీఐ అప్పలరాజు ఎస్సై బి.నాగకార్తిక్.బి. జోగారావు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దర్భగూడెం గ్రామ పంచాయతీ వైసీపీ సర్పంచ్ అభ్యర్థిగా తెల్ల వెంకటేశ్వరరావు నామినేషన్.



జీలుగుమిల్లి నవంబర్ 16;– (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెల్ల వెంకటేశ్వరరావు. వైసిపి సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు బలపరిచిన తెల్ల వెంకటేశ్వరరావు సర్పంచ్ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. దర్భగూడెం గ్రామ పంచాయతీలో ఆరో కీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ పాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా తెల్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సీనియర్ వైసీపీ నాయకులు కొల్లూరి రాంబాబు ఆశీస్సులతో సర్పంచిగా పోటీ చేస్తున్నాను. స్థానికంగా గ్రామంలోని సమస్యలన్నీ నాకు తెలుసు. అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తాను. వైసిపి పార్టీకి ప్రజలలో మంచి స్పందన ఉంది. వైసీపీ పార్టీ తరపున పోటీ చేస్తున్న వార్డు నెంబర్లను మరియు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటేశ్వరరావు అను నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. వైసీపీ నాయకులు కార్యకర్తలు మహిళలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చైత్రకు కొత్త కుటుంబం.. చట్టబద్ధంగా దత్తత అందజేత.!

జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో పూర్తయిన దత్తత ప్రక్రియ..



అమలాపురం, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేకరి) : తల్లిదండ్రుల సంరక్షణకు దూరమైన చిన్నారికి కొత్త కుటుంబం లభించింది.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 10 నెలల చిన్నారి చైత్రను సోమవారం చట్టబద్ధంగా దత్తత అందజేశారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మార్గదర్శకత్వంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల ప్రకారం దత్తత ప్రక్రియను పూర్తి చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జనవరి 29న కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలోని ఉండుర్తివారిపాలెంలో చిన్నారి చైత్ర లభించిందని తెలిపారు. అనంతరం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు చిన్నారిని అమలాపురంలోని శిశు గృహానికి తరలించి అవసరమైన సంరక్షణ, పోషణ అందించారని వివరించారు.
లిసెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ నిబంధనల మేరకు దత్తత ప్రక్రియ చేపట్టగా, 2022లో దత్తత కోసం దరఖాస్తు చేసుకున్న తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన అన్నెస్ ఫాతిమాకు చిన్నారిని చట్టబద్ధంగా అప్పగించినట్లు
కలెక్టర్ వెల్లడించారు. చిన్నారికి సురక్షితమైన, ప్రేమపూర్వకమైన కుటుంబ వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. నాగమణి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. శిరీష, అమలాపురం శిశు గృహ మేనేజర్ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో దళిత హైందవ చైతన్యం

అచ్యుతాపురం దళిత హిందువులకు చీరలు పంపిణీ చేసిన సూర్య పీఠం ట్రస్టు:



గోకవరం.(16-11-26 సత్య దీపిక ఉదయం వీలైకరీ) గోకవరం:సామాజిక అసమానతలను రూపుమాపుటయే ప్రధాన ధ్యేయంగా సూర్య పీఠం ట్రస్టు నిర్వహిస్తున్న దళిత గిరిజన హైందవ చైతన్యంలో భాగంగా ఈరోజు గోకవరం సూర్య పీఠం ప్రాంగణంలో అచ్యుతాపురం గ్రామ దళిత హిందువులతో సత్సంగం నిర్వహించారు.
ఈ సత్సంగంలో సూర్య పీఠం ట్రస్టు ఫౌండర్ ట్రస్టీ తోట సాయిబాబు మాట్లాడుతూ ప్రాచీన భారతదేశంలో ఆనాటి సామాజిక రాజకీయ అసమానతలు కారణంగానే భారీ స్థాయిలో మతమార్పిడి జరిగిందని కావున హిందువులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక అసమానతలు రూపుమాపుటకు కృషి చేయాలని అదేవిధంగా భారతీయులలో కులాభిమానము కంటే దేశాభిమానము ధర్మాభిమానముల స్థాయి పెరిగిన నాడే దేశం వృద్ధి చెందుతుందన్నారు.ఈ సత్సంగములో పాల్గొన్న అచ్యుతాపురం దళిత హిందువులకు చీరలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సత్యనారాయణ, కొరిపిల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు,నంగినీడి రాంబాబు,దేవిశెట్టి చక్ర రావు, చవలం శ్రీనివాసుదొర,సుంకర త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రంశెట్టివారిపాలెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా చింతపల్లి త్యాగరాజు నామినేషన్ దాఖలు



నర్సాపురం నవంబర్ 16 సత్య దీపిక ఉదయం విలేకరి. నరసాపురం మండలంలోని ఎర్రంశెట్టివారిపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి చింతపల్లి త్యాగరాజు నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ కునపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు ఆధ్వర్యంలో ఈ నామినేషన్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది.
ముందుగా గ్రామంలోని పెద్దలు, ముఖ్య నాయకులు మరియు మద్దతుదారులతో కలిసి చింతపల్లి త్యాగరాజు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు

చెత్తపేరుకుపోయింది తొలగించని మహాప్రభో



కొత్తపేట, నవంబర్ 16.
(సత్య దీపిక ఉదయం ప్రతినిధి) కొత్తపేట దొడ్డావారి వీధిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఆవేదన (ఆర్యవైశ్య కళ్యాణ మండపం) వీధిలో పేరుకు పోయిన చెత్త. కుక్కలు, పందులు స్వైర విహారంతో అపారిశుద్ధ్యం తాండవిస్తున్న దృశ్యం. దుర్గంధంతో రోడ్డుపై ప్రయాణించేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్థానిక పంచాయతీ సిబ్బంది చెత్తను వెంటనే తొలగించి బ్లీచింగ్ చల్లాలని స్థానికులు విజ్ఞప్తి.

సురక్షిత బాల్యం -బాలల రక్షణ ఉద్యమం



నర్సాపురం నవంబర్ 16 సత్య దీపిక ఉదయం విలేకరి.నర్సాపురం తూర్పు తాళ్ళు నల్సా పథకం అమలు చేయుటలో భాగంగా ఈ రోజు సాయంత్రం నర్సాపురం మండలం తూర్పుతాళ్ళు జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాల నందు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు వై. ఇస్సాకు అధ్యక్షత వహించగా ప్యానెల్ లాయర్లు జి. శివాజి చక్రవర్తి , బి. ప్రగతి పాల్గొని గుడ్ టచ్ బాడ్ టచ్, లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం (పోక్సో చట్టం 2012, మొబైల్ వాడకం చిన్నారులు పై మానసిక వత్తిడికి గురవుతారని, తెలియకుండానే సైబర్ నేరాలకు గురవుతారని, ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులని గమనించా లన్నారు. .తెలియని వ్యక్తుల నుంచి తినుబండారాలు తీసికోవద్దని, ఇంటిలో అమ్మకు చెప్పకుండా ఎవరితోనూ ఎవరి ఇంటికి వెళ్ళకూడరాదనీ చెప్పారు. ప్రత్యేక హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నంబర్లు చైల్డ్ మ్యారేజ్ పిర్యాదు 1098కి నల్సా హెల్ప్‌లైన్ 15100 కి సైబర్ క్రైమ్ 1930 కి ఫోన్ ద్వారా పిర్యాదు చేయాలని మరియు మూడు సురక్షిత నియమాలైన " కాదు అని చెప్పు, దూరంగా కదులు, ఎవరికైనా చెప్పు " వాటి పై అవగాహనా కల్పించ్చారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాళ్లంటర్ డి. వరలక్ష్మి,ఉపాధ్యాయులు, విద్యారలు పాల్గొన్నారు.

హనీట్రాప్ గూఢచర్యంలో ఒక భాగం..

వాయుసేన చీఫ్ కీలక వ్యాఖ్యలు

విదేశీ సైబర్ దాడులకు లొంగనంత సురక్షితంగా భారత మిలటరీ వ్యవస్థ, దాని పరిశోధన విభాగాలున్నాయని.. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్ వలపు వలలు విసిరే మార్గాన్ని ఎంచుకుందని భారత వాయుసేన చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ పేర్కొన్నారు.'మిలటరీ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ అనేది పబ్లిక్ నెట్‌వర్క్ నుంచి వేరుగా ఉంటుంది. దానిపై సైబర్ దాడికి పాల్పడడం అసాధ్యం. అందుకే విదేశీ ఇంటెలిజెన్స్.. సాంకేతికంగా దెబ్బతీయలేక.. హనీ ట్రాప్ పేరుతో మనుషులను ఉపయోగిస్తోంది. పబ్లిక్ సెక్టార్ లాబోరేటరీ సిబ్బంది, ప్రైవేట్ సెక్టార్‌లోని డిఫెన్స్ కాంట్రాక్టర్లను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా ప్రేమ ప్రేరుతో ట్రాప్ చేస్తున్నారు.వలపు వలలు అనేవి ఇంటెలిజెన్స్ గూఢచర్యంలో చిన్న భాగం. నిజానికి ఇది వలపు వల కాదు. గూఢచర్యంలో ఓ భాగం. ఈ రోజుల్లో ఇది సోషల్ మీడియా వేదికగా జరుగుతుంది. మొత్తం గూఢచర్య మార్గాలను పరిగణనలోకి తీసుకుంటే హనీట్రాప్.. ఒక అంశం మాత్రమే. లోన్స్ పేరుతో, మార్కెట్ పేరుతో.. ఇలా చాలా ఉన్నాయి. ఇలాంటి వాటిపై నిరంతర దృష్టి పెడుతున్నాం. నిశితంగా పరిశీలిస్తూ.. కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. మిలటరీ నెట్‌వర్స్‌పై సైబర్ దాడులకు పాల్పడలేరు. కానీ.. వ్యవస్థ లోపలి నుంచి ప్రమాదం పొంచి ఉంది. అందుకే దానికి సంబంధించి కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం. ట్రైనింగ్ ఇచ్చేటప్పుడే ఉద్యోగులకు ఈ విషయాలపై అవగాహణ కల్పిస్తున్నాం' అని మార్షల్ అశుతోశ్ తెలిపారు.ఈ మధ్య కాలంలో ఇలాంటి హనీ ట్రాప్ దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. సున్నితమైన సమాచారాన్ని దొంగిలించడానికి తన సహోద్యోగి మొబైల్‌లో మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారన్న ఆరోపణలపై ఢిల్లీలోని ఓ ఢిఫెన్స్ అధికారిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా.. వ్యక్తిగత జీవితంలో క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న ఆయనకు.. కొన్ని నెలలుగా.. పాకిస్థానీ గూఢచారిగా భావిస్తున్న ఓ మహిళతో సాన్నిహిత్యం ఉన్నట్లు తేలింది.ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. ఇండియన్ నేవీ అధికారి ప్రదీప్



ముఖర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు. కొన్ని నెలలుగా ప్రదీప్.. పాకిస్థానీ మహిళతో సోషల్ మీడియా ద్వారా స్నేహం చేస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం.. ఎన్విడియా సీఈవో.. చైనా గూఢచారితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కూటమి సర్పంచ్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



జీలుగుమిల్లి నవంబర్ 16;- (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) పోలవరం నియోజకవర్గ జీలుగుమిల్లి పంచాయతీ స్థానిక సర్పంచ్లు ఎన్నికలకు జనసేన పార్టీ బలపరుస్తున్న అభ్యర్థుల జాబితాను శాసనసభ్యులు చిర్రి బాలరాజు , జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, సీనియర్ జనసేన నాయకులు చిర్రి కృష్ణ మరియు మండల అధ్యక్షులు పసుపులేటి రాము సంయుక్తంగా అభ్యర్థుల జాబితాను సోమవారం వెల్లడించారు.

జీలుగుమిల్లి పంచాయితీకి చిర్రి శ్రీనివాసరావు, తాటియాకులగూడెం చిర్రి సుమాంజలి ములగలం పల్లి సరియం లక్ష్మి, టి గంగన్నగూడెం కొమరం వెంకటేశ్వరరావు అంకన్నగూడెం మడివి నారాయణ ను కూటమి తరపున జనసేన బలపరుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అభ్యర్థుల అందరికీ అదే విధంగా మండల వ్యాప్తంగా కూటమి బలపరిచిన అభ్యర్థులందరును సమిష్ఠగా కూటమి గెలిపించుకోవాలని శాసనసభ్యులు పిలుపునిచ్చారు. జడ్పిటిసి ,ఎంపీటీసీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో ఉంచుకొని అందరు సైనికులు అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని శాసనసభ్యులు పిలుపునిచ్చారు.

మిమ్మల్ని వెతికి పట్టుకుంటాం..

అమెరికా నేవీ అధికారులకు ఇరాన్ హెచ్చరిక!



ఇరాన్,

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్నాయి. తమ దేశంలోని మినాబ్ నగరంలో బాలికల పాఠశాలపై జరిగిన క్షిపణి దాడికి బాధ్యులంటూ ఇద్దరు అమెరికన్ నేవీ అధికారుల పేర్లను గతంలో ప్రస్తావించిన ఇరాన్.. తాజాగా వారిని లక్ష్యంగా చేసుకుని హెచ్చరికలు జారీ చేసింది. 'మిమ్మల్ని వెతికి పట్టుకుంటాం' అంటూ ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చకు దారి తీశాయి.

ఇద్దరు అధికారుల పేర్లను వెల్లడించిన ఇరాన్

దక్షిణాఫ్రికాలోని ఇరాన్ రాయబార కార్యాలయం నవంబర్ 13న ఎక్స్ వేదికగా ఈ హెచ్చరికలను జారీ చేసింది. గత మార్చి 28న ఇద్దరు అమెరికా నేవీ అధికారుల ఫొటోలతో చేసిన పోస్టును మళ్లీ రీషేర్ చేస్తూ.. 'మిమ్మల్ని వెతికి పట్టుకుంటాం' అని పేర్కొంది. ఇరాన్ ప్రస్తావించిన అధికారుల్లో కమాండర్ లీ ఆర్ టేట్ (గ్రావఅస్త్రష్ట్ర =. ఘ్ఫవ), లెఫ్టినెంట్ కమాండర్ జెఫ్రీ ఈ.యార్క్ (జీవటటతీవఎ జు.ీశీతీన) ఉన్నారు. వీరిలో టేట్ యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ యుద్ధనౌకకు కమాండింగ్ ఆఫీసర్‌గా, యార్క్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మినాబ్ పాఠశాలపై మూడుసార్లు టోమాహాక్ క్షిపణులను ప్రయోగించాలని ఈ ఇద్దరు అధికారులే ఆదేశించారని ఇరాన్ ఆరోపించింది. ఈ దాడిలో 168 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది.

అసలు మినాబ్ పాఠశాలలో ఏం జరిగింది?

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు ప్రారంభమైన సమయంలో దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ నగరంలో ఉన్న బాలికల పాఠశాలపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఇతరులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 168 మంది చిన్నారులు మరణించారని ఇరాన్ తెలిపింది. అయితే మృతుల సంఖ్యపై వివిధ నివేదికల్లో తేడాలున్నాయి. ఈ దాడికి తమ దేశ బలగాలే కారణమై ఉండవచ్చని అమెరికా మీడియాలో కథనాలూ వచ్చాయి.

ఏఐ దుర్వినియోగంపై మెగాస్టార్ చిరంజీవి పోరాటం..

ఏఐ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అయితే ఇదే సాంకేతికతను కొందరు దుర్వినియోగం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా సెలబ్రిటీల ఫొటోలు, వీడియోలను ఉపయోగించి నకిలీ డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించడం, వ్యక్తుల పేరుతో తప్పుడు ప్రచారం చేయడం, డిజిటల్ మోసాలకు పాల్పడటం వంటి ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్ టెక్నాలజీ ముప్పును అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తాజాగా కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి ప్రత్యేకంగా వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం చిరంజీవి తీసుకున్న ఈ చొరవ సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.ఏఐ టెక్నాలజీని ఉపయోగించి సృష్టిస్తున్న నకిలీ వీడియోలు, డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల సెలబ్రిటీలతో పాటు సామాన్య ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చిరంజీవి ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తుల అనుమతి లేకుండా వారి ముఖాలు, గొంతులను ఉపయోగించి అసత్య ప్రచారాలకు పాల్పడటం, అభ్యంతరకరమైన వీడియోలు రూపొందించడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

చంద్రబాబు అరాచకాలు ఎక్కువ కాలం సాగవు: సజ్జల



గుంటూరు: ముఖ్యమంత్రి చంద్ర బాబు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికలను? ఎదుర్కోవడం చంద్రబాబుకు చేతకాదు అంటూ ఆయనపై వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు అరాచకాలు ఎక్కువ కాలం సాగవని హెచ్చరించారు. అలాగే, పోలీసులను అడ్డం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కూటమి గెలిచిందని చెప్పుకొచ్చారు. అలాగే, ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయింది.. పోలీసులు టీడీపీ కార్యకర్తల మాదిరిగా పనిచేస్తున్నారని ఆరోపించారు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించడానికి వైఎస్సార్‌సీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తలశిల రఘురాం, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, నూరి ఫాతిమా, డైమండ్ బాబు, పలువురు నేతలు గుంటూరు జిల్లా జైలుకు వెళ్లారు. ములాఖత్ ద్వారా లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించారు. అనంతరం, సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'పోలీసులు, కూటమి నేతలు చట్టాన్ని దుర్వినియోగం చేశారు. అబద్దాలు చెప్పి ఎన్నికల్లో కూటమి గెలిచింది. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?. బ్యాలెట్ బాక్స్‌ను అక్రమంగా తీసుకెళ్లే వారిని అరెస్ట్ చేయకుండా అక్రమాలను అడ్డుకున్న అప్పిరెడ్డిని అరెస్టు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కూటమి గెలిచింది. పోలీసులు, కూటమి నేతలు చట్టాన్ని దుర్వినియోగం చేశారు. పోలింగ్ బూత్ దగ్గరే కూటమి నేతలు డ్రామాలు మొదలు పెట్టారు.

పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి నేతలు అరాచకాలు చేస్తున్నారు. పోలీసుల బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరు. భవిష్యత్‌లో కూటమి నేతలు చట్టపరంగా శిక్ష ఎదుర్కొక తప్పదు. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించిన పోలీసులపై న్యాయ పోరాటం చేస్తాం. రానున్న రోజుల్లో కూటమి నేతలకు చట్టపరంగా శిక్ష తప్పదు. గతంలో ఈవీఎంలు, ఇప్పుడు బ్యాలెట్ బాక్స్‌లతో కూటమి అక్రమాలు చేస్తోంది. పులివెందులలో రెండువేల మందికిపైగా అక్రమ కేసులు బనాయించారు. వైఎస్ జగన్ బయటకు వస్తే చంద్రబాబుకు వణుకు' అని అన్నారు.

మధురై తనిష్క్ చోరీ కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు..

చెన్నై: తమిళనాడు మధురైలోని తనిష్క్ షోరూమ్‌లో నగలు చోరీ(మ్ఫిఒబతీఖిఱ ఖ్ఫఅఅంష్ణన ఒవఱఅర్) జరిగిన విషయం తెలిసిందే. ఆ షోరూమ్ నుంచి 21 కోట్ల విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్తారు. నవంబర్ 12వ తేదీన జరిగిన ఈ ఘటనలో ప్రధాన నిందితుడు 25 ఏళ్ల నిషాంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బెంగుళూరు నుంచి సేలం వెళ్తున్న ఓమ్నీబస్సు డ్రైవర్ నిందితుడు నిషాంత్‌ను గుర్తుపట్టి, పోలీసులకు సమాచారాన్ని చేరవేశాడు. అధియమన్‌కొట్టిఐ పోలీసులు సీసంపత్తి బైపాస్ వద్ద బస్సును అడ్డగించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బస్సు కిటికీ నుంచి అతను పారిపోయే ప్రయత్నం చేశాడు. కానీ పోలీసులు అతన్ని చుట్టుముట్టేశారు. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక బృందానికి సమాచారాన్ని చేరవేయడంతో మధురై నుంచి ప్రత్యేక బృందం ధర్మపురి చేరుకున్నది.నిషాంత్‌ను పట్టుకోవడానికి ముందే.. షోరూమ్ నుంచి ఎత్తుకెళ్లిన కొంత ఆభరణాలను సీజ్ చేశారు. ఈ కేసులో నిషాంత్ తండ్రి, అతని ప్రేయసి మీనాక్షిని అదుపులోకి తీసుకున్నారు.నవంబర్ 14వ తేదీన ఆ ఇద్దర్నీ అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు ఆరు కిలోల బంగారు, వజ్రాభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మాడకుళం ట్యాంక్ సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ భూమిలో ఆ నగలను పాతిపెట్టారు. నవంబర్ 29 వరకు ఆ ఇద్దర్నీ రిమాండ్‌లోకి తీసుకున్నారు. ఈ చోరీ కేసులో నిషాంత్ మాస్టర్ మైండ్ అని పోలీసులు ప్రకటించారు. సురేశ్, మీనాక్షీ ఈ చోరీలో హెల్ప్ చేశారు.పలంగనాథమ్ రోడ్డులో ఉన్న షోరూమ్ నుంచి నిషాంత్ సుమారు 15 కేజీల బంగారం, డైమండ్ జ్వలరీని దొంగలించాడు. త్రిపురకుండ్రంలోని ఓ బ్రిడ్జ్ వద్దకు తండ్రిని రమ్మని ఆ ఆభరణాలను అతనికి అప్పగించినట్లు పోలీసులు చెప్పారు. ఆ తర్వాత పలంగనాథమ్‌లో ఉన్న ఇంటికి నిషాంత్ వెళ్లాడు. జ్వలరీని దాచేందుకు మీనాక్షీ కూడా వెళ్లింది. తర్వాత రోజున తండ్రి ఆటో తీసుకుని ఓ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు.

జర్నలిస్టు నుంచి జనసేవకుడిగా!

సర్పంచ్ బరిలో బీర చిన్నారావు!
కమిని గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు!



ముమ్మిడివరం నవంబరు 16 (సత్య దీపిక ఉదయం విలేఖరి): ముమ్మిడివరం మండలం కమిని గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలోకి స్వతంత్ర అభ్యర్థిగా బీర చిన్నారావు నిలిచారు. ఈ మేరకు ఆయన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న బీర చిన్నారావుకు గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులు, స్థానిక అవసరాలపై మంచి అవగాహన ఉంది. జర్నలిస్టుగా తన వృత్తి ప్రయాణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దగ్గరగా పరిశీలించడంతో పాటు, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలపై అవగాహన కలిగిన ఆయన, ప్రజా ప్రతినిధిగా గ్రామ అభివృద్ధికి మరింత బాధ్యతతో పనిచేయాలనే ఉద్దేశంతో ఎన్నికల బరిలోకి దిగినట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు జర్నలిస్టుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ఆయన, ఇకపై ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రత్యక్షంగా కృషి చేయాలనే లక్ష్యంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్నది ఆయన అభిలాషగా కనిపిస్తోంది. జర్నలిస్టుగా ప్రజా సమస్యలపై సంపాదించిన అనుభవం, గ్రామ ప్రజలతో ఉన్న పరిచయాలు ఎన్నికల్లో తనకు అనుకూలంగా మారుతాయని బీర చిన్నారావు ఆశాభావంతో ఉన్నారు. కమిని గ్రామ ఓటర్లు ఆయన అభ్యర్థిత్వాన్ని ఎలా స్వీకరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం నందు కార్తీక మాసం సందర్భంగా మొదటి సోమవారం భక్తులు పోటెత్తారు.



కాకినాడ రూరల్ నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం):
కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ స్థానిక ఇంద్రపాలెం గ్రామంలో కొలువైయున్న శ్రీ గౌరీ కేదారేశ్వర స్వామి ఆలయం నందు భక్తులు అధిక సంఖ్యలో వేకువజామున నుండి భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఆలయ ప్రాంగణమంతా శివనామ స్మరణతో మారుమోగింది. ఆలయ చైర్మన్ చొల్లంగి శ్రీనివాసరావు మరియు చైర్మన్ కుమార్తె పిల్లి దుర్గా దీప్తి ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం ఉదయం నుండి విశేష పూజలు మరియు అభిషేకాలు కార్తీక్ మాసం సందర్భంగా మొదటి సోమవారం విశిష్ట అలంకారములు చేయించారు. ప్రధాన అర్చకులు వారిచే గోత్రనామాలతో భక్తులకు స్వామి దర్శనం. అనంతరం తీర్థప్రసాదాలు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL
Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

నామినేషన్ నాటి నుండే ప్రచారం



తాళ్లపూడి, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేకరి) : మండల కేంద్రంమైన తాళ్లపూడిలో సీనియర్ టీడీపీ నాయకులు గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా నామన పరమేశ్వర్‌రావు సోమవారం నామినేషన్ వేసిన మరుక్షణం నుండి ప్రచారం టీడీపీ వర్గీయలతో సమావేశం నిర్వహిం చారు. అనంతరం బి.సి కాలనీలో అభిమానులు పరమేశ్వర్‌రావ్ ను అభినందించారు. గ్రామదేవత ఆలయం వద్ద ఆయనను అభిమానులు కలిసి అభినందనలు తెలిపారు. గతంలో పలుసార్లు సర్పంచ్‌గా పని చేసిన ఆయన గ్రామ అభివృద్ధికి పని చేస్తానని, ఎంపీటిసిలుగా తన సోదరుడు రవి ని, గుండుబోగుల దుర్గా నాగిని లను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట అభిమానులు పాల్గొన్నారు.

యాళ్ల బాబురావు నామినేషన్ ధాఖలు



తాళ్లపూడి, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేకరి) : తాళ్లపూడి మండలం ప్రక్కిలంక పైడిమెట్ట ల గ్రామపంచాయతీ నందు స్వతంత్ర అభ్యర్థిగా రాబోయే సర్పంచి ఎన్నికలలో యాళ్ల బాబురావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ స్వప్న కౌశిక్, కొల్లి దుర్గారావు, భాస్కర్, చంద్రం, మణికంఠ, రజిని, గంగరాజు, హరి, రమేష్, నున్నబోయిన శ్రీను, ఇర్లపాటి కిషోర్, వినోద్, సునీల్ యూత్, అభిమానులు, మహిళలు శ్రేయోభిలాషులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

వేములదీవి వెస్ట్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కొండేటి నాగమణి శ్రీనివాసరావు



నర్సాపురం, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేఖరి) – నరసా పురం మండలం, వేములదీవి వెస్ట్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కొండేటి నాగమణి శ్రీనివాసరావు సోమవారం నాడు తమ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు గ్రామంలోని వివిధ వార్డుల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు, మద్దతుదారులు స్వచ్ఛందంగా తరలివచ్చారు గ్రామ ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలు, నినాదాల మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఈ నామినేషన్ ర్యాలీ కొనసాగింది. నామినేషన్ దాఖలు అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్న కొండేటి నాగమణి శ్రీనివా సరావు, ముఖ్య నాయకులు మరియు ప్రతిపాదకుల సమక్షంలో నామి నేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ దాఖలు అనంతరం కొండేటి నాగమణి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు చూపిస్తున్న ఆదరణ మరియు మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. వేములదీవి వెస్ట్ గ్రామ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి సేవ చేసే అవకాశం కల్పించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు, యువజన నాయకులు, మహిళలు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

పల్లంకుర్రు సర్పంచ్ అభ్యర్థిగా ఇసుకపట్ల వెంకటేశ్వరరావు నామినేషన్!



కాట్రేనికోన, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేకరి) : కాట్రేని కోన మండలం పల్లంకుర్రు గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఇసుకపట్ల వెంకటేశ్వరరావు సోమవారం ఉదయం 9:53 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ముందు ఉదయం 9:00 గంటలకే పల్లంకుర్రులోని ఆయన స్వగృహం వద్దకు తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుండి అందరూ కలిసి కోలాహలంగా భారీ ఊరేగింపుతో నామినేషన్ కేంద్ర మైన కందికుప్ప పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. గ్రామ సర్వతోముఖాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు వెంకటే శ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. తమ గ్రామాన్ని ఆదర్శ పంచా యతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇస్తూ గ్రామ ప్రజలందరి ఆశీస్సులు కోరగా, తరలివచ్చిన ప్రజలు మరియు కూటమి నాయకులు ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ఈ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





రామాయణ కథ - శుద్ధపరబ్రహ్మ స్వరూప సాక్షాత్కార సాధనా సోపానములు

జటాయువు మరణం

జటాయువు దశరథునికి మిత్రుడు. రామునకు అప్పుడు, రావణుడు సీతను ఎత్తుకొని పోతూ ఉంటే ఆ పనికూడదని బుద్ధిచెప్పి, రావణుడు వినని కారణంగా అతనితో యుద్ధం చేసి రెండు రెక్కలు తెగి కిందపడిపోయింది. సీతాన్వేషణలో రాముడు జటాయువును చూసి, రావణుడు సీతను ఎత్తుకుపోయిన సంగతిని చెప్పి రాముని చేతిలో ప్రాణాలు వదిలింది. జటాయువునకు రాముడు తండ్రికి పుత్రుడు చేసినట్లు దహన సంస్కారాలు జరిపేడు. జటాయువు అనగా వేదవిజ్ఞానం అని లోగడ తెలుసుకుంటిమి. రావణునకు బుద్ధి చెప్పింది అనగా వేద పరమార్థం ప్రకృతిని అపహ రించడం కాదు, ప్రకృతియొక్క ఆరాధన, సహకారంతోనే ముక్తిని పొందాలి సుమా ! అని సాధకునిలోని వేదవిజ్ఞానం దశేంద్రియవృత్తికి చెప్పింది. తమోగుణ విశిష్ఠమైన దశేంద్రియవృత్తి ఆ మాటలు వినలేదని అర్థం. జటాయువు రెక్కలు తెగనరకుట అనగా వేందంలోని ఉపాసనా, కర్మకాండలు రెక్కలుగా భావించాలి. జటాయువు రావణునికి బుద్ధిచెప్పింది అనగా రాక్షసుల్లో కూడా అగ్నిహోత్రారాధన, వేదాధ్యయనం, కర్మాచరణ ఉంటుంది. అయితే ముక్తి కోసం ఇంద్రియ నిగ్రహాన్ని సంపాదించడం కోసం దాన్ని రాక్షస గుణాలు కలవారు వినియోగించరు. దేవతాను గ్రహంతో వరాలు పొంది స్వార్థానికి ఉపయోగించుకుంటారు. కావున అది తగదని బుద్ధిచెప్పడమే జటాయువు రావణునికి బుద్ధిచెప్పడం. రామునకు జటాయువు సీతాపహరణం గురించి చెప్పింది అనగా సాధకునిలోని వేదశాస్త్ర విజ్ఞానం వేదసమ్మతంగా దశేంద్రియ సాధనచేస్తూ యున్న సాధకు నకు అతనిలోని దశేంద్రియ కేంద్రం చేత అపహరించబడింది అనే దాన్ని అతనికి తెలియ పరచింది అని అర్థం. జటాయువునకు తండ్రికి వలె అగ్ని సంస్కారం చేశాడు అనగా దశేంద్రియ నిగ్రహ సాధనకు తోడ్పడిన వేదవిజ్ఞానానికి తేజస్సు కల్గించేడు అని అర్థం. ఈ విధంగా దశేంద్రియ కేంద్ర వృత్తి యొక్క ప్రాబల్యాన్ని సాధకుడు గ్రహించేడు. ఇచ్చట తండ్రి పదం ॥ ఇంద్రియ నిగ్రహ సాధనను, అగ్ని సంస్కారం అనే పదం జ్ఞాన ప్రకాశాన్ని జటాయువు అనే పదం వేదాన్ని తెలుపుతుంది.

అయోముఖికథ :

సీతాన్వేషణ చేస్తూ రామలక్ష్మణులు అరణ్యంలో నడుస్తుండగా పాతాళ సదృశమైన లోగల ఒక పెద్ద పర్వత గుహ కనబడింది వారికి అది తమస్సుతో (చీకటితో) ఆవరింపబడియుంది. ఆ గుహ దగ్గరకు అనే ఒక రాక్షసి కన్పించింది. రాముడు చూస్తూ యుండగనే కామోద్రేకంతో అది లక్ష్మణుని ఆ గుహ దగ్గరకు రామలక్ష్మణులు వెళ్ళగానే భయం కల్గిస్తూ వికృతమైన నోరు పడింది. వెంటనే లక్ష్మణుడు దాని ముక్కు, చెవులూ, స్తనాలు కోసివేశాడు. ప్రకృతిని కోల్పోవడంతో .. కల్గిన అయోముఖి... సాధకున్ని తమోవృత్తి బాగా ఆవరించింది అనీ దానిని జీవాత్మ తొలగించిందనీ అయో ముఖి కథకు అంతరార్థం. మూలాధారంలో కుండలిని తమస్సు చేత ఆవరింపబడియుంటుంది. పాతాళ సమమైన పెద్దగుహ అనగానే దేహంలోని అథోభాగంలో వాసనామూలమైన మూలాధార చక్రం "అయోముఖి" ' చెప్పుకోవాలి. లక్ష్మణునిపై కామోద్రేకం పడింది అనగా తమోగుణం జీవాత్మను పునర్జన్మ కల్గించే కర్మలను ఆచరించడానికి ప్రోత్సాహపరిచింది అని అర్థం. రెండేసి ద్వారములు కల ముక్కు చెవులు అనగా తామసిక రాజసిక ద్వంద్వములు యొక్క ఇంద్రియవృత్తులు. రెండు స్తనములు అనగా సాత్విక ద్వంద్వాల వృత్తులు. అవి హృదయగర్భంలో పుడతాయి కావున గుండె పైని గల స్తనాలుగా పోల్చబడ్డాయి. సాధకునికి ప్రకృతి విరహంతో త్రిగుణాత్మకమైన సత్వ, రజో, తమో గుణవృత్తులు జీవాత్మను ఆవహిస్తాయనీ, వానిని సాధకునిలోని జీవుడు తనలోని ఆత్మాంశతో తొలగించుకుంటాడనీ రాముడు (సాధకుడు) చూస్తుండగా లక్ష్మణుడు అయోముఖి ముక్కు, చెవులు, స్తనాలు కోసేడన్న దానిలోని అంతరార్థం స్పష్టంగా తెలుస్తున్నది. శూర్పణఖకు స్తనాలు కోయలేదు. అయోముఖి స్తనాలు కోశాడు అనగా మొదట తామసిక రాజసిక వృత్తులే విజృంభించాయి. (అనగా శూర్పణకకు అర్థం) అయోముఖి విషయంలో తామసిక, రాజసిక వృత్తు లతో పాటు సాత్విక వృత్తులు కూడా విజృంభించాయి. సాత్త్విక వృత్తులు హృదయ గర్భంలో పుడ తాయి కావున స్తనాలతో పోల్చారు. స్తనము అనగా ధ్వని అని కూడా అర్థం. స్తనద్వంద్వం అనగా సాత్వికద్వంద్వములు యొక్క ధ్వనులు అనే అర్థం వస్తుంది. సాధకునిలోని ప్రకృతి అంశ దూరమై నపుడు కలిగే జీవాత్మ పరిణామంలను సాధకుడు ఎలా ఎదుర్కొని బయటపడాలో చెప్పవలసిన అవసరం వుండడం వల్లనే వాల్మీకి ఈ అయోముఖి కథను చెప్పారు. ఇదే విధంగా కబంధవధ, శబరీ దర్శనం అనే కథలు కూడా అంతరార్థంతో సాధకునికి సాధనలను వివరిస్తున్నాయి.

కబంధ వధ :

రామలక్ష్మణులు క్రౌంచారణ్యంలో సంచరిస్తుండగా కబంధుడనే రాక్షసుని హస్తాలలో చిక్కుకున్నారు. కబంధుడనే వాడు తలలేని మొండెం మాత్రమే యున్న ఒక రాక్షసుడు తలేక పోయినా అతని గుండెలోనే నోరు, కళ్ళూ ఉన్నాయి. అతనికి యోజనం పొడవైన చేతులున్నాయి. ఆ చేతులతో పట్టి అడవిలోని జంతువులను లాక్కుని భక్షిస్తూ పొట్టనింపుకుంటున్నాడు. రామలక్ష్మణులు ఆ కబందహస్తాల్లో చిక్కుకున్నారు. వారిని మ్రింగడానికి సిద్ధపడుతుండగా రామలక్ష్మణులు వాడి రెండు చేతులూ ఖండించివేశారు. దానితో వాడు ప్రాణాలు విడుస్తూ తన కథ చెప్తూ తనకొక శాపం యుందని తన రెండు చేతుల్ని నరికినప్పుడు శాపవిమోచనం కల్గునని ఇంద్రుడు చెప్పాడని చెప్తాడు. రాముడు వానికి అగ్ని సంస్కారం గావించి ముక్తిని కలిగిస్తాడు.

కబంధుడు అనగా 'క' అంటే సుఖం, బంధం అంటే కర్మబంధం. సుఖరూపవాసనా కర్మ బంధం 'కబంధ' పదానికి అర్థం. మోక్షానికి ప్రతిబంధకమైనది. సుఖవాసనా కర్మబంధాలు. వాడి రెండు చేతులు యోజన పొడవు. ఆ చేతులతోనే ప్రాణులను పట్టుకుని మ్రింగుతాడు అనగా రెండు బాహువులు అనగా సుఖ దుఃఖ ద్వంద్వ బంధాలు. ఈ బహుత్వ ద్వంద్వ దృక్పథం (కర్మలు) మోక్షా నికి ప్రతిబంధకాలు. "ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" అనగా సర్వమూ ఏకరూపమైన బ్రహ్మగా తెలిసి దర్శించాలి. "సర్వం ఖల్విదం బ్రహ్మ" పుట్టిన ప్రతీదీ బ్రహ్మపదార్థమే. ఈ విధంగా సర్వమూ బ్రహ్మ పదార్థంగా తెలియపోవడాన్ని, దర్శించలేకపోవడాన్ని కారణం సుఖ దుఃఖ మనోవృత్తులు. ఆ ద్వంద్వ వృత్తులను నాశనం చేసి ద్వైత దృష్టి లేకుండా సాధకుడు చేయడమే కబంధుని రెండు చేతులు నరక డంలోని అంతరార్థం. మొదట అయోముఖి కథ. వెంటనే కబంధవధ కథలోని అంతరార్థాలు ఏమి టంటే మొదట రాజస తమోవృత్తులను నాశనం చేస్తేనే తదుపరి సుఖ దుఃఖ ద్వంద్వ వృత్తులనే ద్వైత దృష్టిని నాశనం చెయ్యగలరు అని సాధనాక్రమంలో చెప్పడం జరిగింది. రాముడు కబంధ దేహాన్ని అగ్నిసంస్కారం చేయడం, కబంధుడు మోక్షాన్ని పొందాడు అనగా సుఖదుఃఖ ద్వైత దృష్టి నాశనం కాగానే సాధకుని లోపల జ్ఞానప్రకాశం ఇనుమడిస్తుందనీ, ఆపైన ముక్తి మార్గంలో నడుస్తుం డడం జరుగుతున్నదనీ ఈ కథలు రెండూ చెప్తున్నాయి. (ఇంకా ఉంది)

రచన : పరిపూర్ణబోధాచార్య గుర్రాల మోహనరావు ఆర్యులు
అధ్యక్షులు, శ్రీ భీంపల్లి గడ్డయ్యార్య కేంద్ర భక్తసమాజం
విశాఖపట్టణం, సెల్ : 9848482843



పంచాయతీ ఎన్నికల బరిలో భారీగా అభ్యర్థులు

రెండో రోజు మూడు మండలాల్లో జోరందుకున్న నామినేషన్లు

పర్వం.. సర్పంచ్‌లకు 219, వార్డులకు 612 నామినేషన్లు

మందస, నవంబర్ 16 (సత్యదీపిక ఉదయం బ్యూరో) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పలాస నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రాజకీయ సందడి నెలకొంది. పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో సోమవారం రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ఉత్సాహభరితంగా సాగింది. వివిధ రాజకీయ పార్టీల మద్దతుతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ముందుకొచ్చి తమ నామినేషన్లను దాఖలు చేశారు. అనుచరులు, మద్దతుదారులతో నామినేషన్ కేంద్రాలకు చేరుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. రెండో రోజు మూడు మండలాల పరిధిలో సర్పంచ్ స్థానాలకు 219 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 612 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.
మండలాల వారీగా పరిశీలిస్తే మందస మండలంలో సర్పంచ్ స్థానా లకు 93 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 307 మంది నామినేషన్లు వేశారు. వజ్రపుకొత్తూరు మండలంలో సర్పంచ్ స్థానాలకు 89 మంది, వార్డు స్థానాలకు 204 మంది నామినేషన్లు దాఖలు చేయగా, పలాస మండలంలో సర్పంచ్ స్థానాలకు 37 మంది, వార్డు సభ్యుల స్థానాలకు



101 మంది నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టగా, కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.రెండో రోజే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ తీవ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తు న్నాయి. నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.

సువర్ణపురంలో వైఎస్సార్‌సీపీకి షాక్.. టీడీపీలోకి 10 కుటుంబాల చేరిక!

కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ శ్రేణులు



పలాస నవంబర్16 (సత్యదీపిక ఉదయం బ్యూరో) : రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతో పాటు కూటమి ప్రభుత్వ పాలనపై నమ్మకంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మందస మండలం సువర్ణపురం పంచాయతీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల కార్యక్రమం సిర్ల కృష్ణారావు, బతకల వెంకటరావు, కోణారి తులసిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీలో చేరిన వారిలో బతకల చలపతి, బతకల నాగేశ్వరరావు, బతకల జానకమ్మ, బతకల సరస్వతి, బతకల దమయంతి, బతకల యాదవరావు, బతకల విశ్వనాథం, బతకల జయమ్మ, బతకల ధనలక్ష్మి, బతకల శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు. వీరితో పాటు కరగాన వాసు, అడ్డి ఈశ్వరరావు, బతకల జోగారావు, కోణారి మురళీమోహన్, హరిప్రసాద్, మాధవరావు పాల్గొన్నారు.

నూతన శివాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్



నరసాపురం, నవంబర్ 16 సత్య దీపిక ఉదయం విలేకరి – ఆధ్యాత్మిక వికాసానికి, సనాతన ధర్మ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ.. మొగల్తూరు మండలం కె.పి. పాలెం నార్త్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శివాలయ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసా పురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఎమ్మెల్యే . ఆలయ నిర్మాణ పనులు నిర్విఘ్నంగా, త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఆపరమేశ్వరునికృపాకటాక్షాలతోనియోజకవర్గ ప్రజలందరూ సుఖ శాంతులతో,పాడిపంటలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా భగవం తుడిని ప్రార్థించారు.

నామినేషన్ వేసిన 1వ వార్డు అభ్యర్థి గోళ్ళ నిర్మల



జీలుగుమిల్లి, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామ పంచా యతీ 1వ వార్డు అభ్యర్థిగా వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు బలపరిచిన అభ్యర్థి గోళ్ళ మధు సోమవారం నామినేషన్ వేసినారు. నామినేషన్ కు గ్రామ ప్రజలు మరియు గ్రామ పెద్దలు మద్దతుగా నిలిచినారు. మదు కే మా ఓటు వేసి అఖండ విజయం చేకూరుస్తామని పత్రిక పూర్వకంగా మాట్లాడుతూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు అందరూ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, నవంబర్ 16 (సత్యదీపిక ఉదయం బ్యూరో) – పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత రెండో రోజు నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ లోని కొత్తూరు మరియు అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేబాక గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి, నామినేషన్ దాఖలు చేసేందుకు వస్తున్న అభ్యర్థులను మరియు వారికి మద్దతు తెలుపుతున్న మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (కోడ్) పక్కాగా అమలు చేస్తున్నారు.

తనిఖీలలో భాగంగా సిబ్బందికి, అధికారులకు జిల్లా ఎస్పీ గారు పలు కీలక సూచనలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులందరూ ఒకేసారి రాకుండా, వారికి వేర్వేరు సమయాలు (స్లాట్లు) కేటాయించేలా చూడాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రజలు, కార్యకర్తలు గుమికూడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రిటర్నింగ్ అధికారులకు(ఆర్టిఓ) సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, అభ్యర్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ తనిఖీలలో అనకాపల్లి రూరల్ సీఐ అశోక్ కుమార్, అనకాపల్లి టౌన్ సీఐ ప్రేమ కుమార్, ఎస్సైలు రవికుమార్, వెంకటేశ్వరరావు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రెబల్ మందపల్లి కుర్చీ నాకే ఇవ్వండి - కూటమి సిద్ధాంతానికి బీటలు

కూటమి సమీకరణాల్లో జనసేనకు కేటాయించిన మందపల్లి పంచాయతీ కుర్చీ 20 ఏళ్ల పంచాయతీ పాలన అనుభవంతో ప్రచారానికి శ్రీకారం

కొత్తపేట, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) – మందపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల రాజకీయం అనూహ్య మలుపు తిరిగింది.కూటమి పొత్తులో భాగంగా మందపల్లి సర్పంచ్ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించడంతో తెలుగుదేశం పార్టీలో సర్పంచ్ అభ్యర్థిత్వాన్ని ఆశించిన నాయకులకు కొత్త రాజకీయ పరిస్థితి ఎదురైంది.అయితే ఈ స్థానంపై ఆశలు పెట్టుకున్న టీడీపీ మాజీ సర్పంచ్ చింతం విజయ కృష్ణ మోహన్ మాత్రం వెనక్కి తగ్గకుండా టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు.ఇప్పటికే గ్రామంలో తొలి విడత ప్రచారాన్ని ప్రారంభించడంతో మందపల్లి రాజకీయాలు ఒక్కసారిగా ఆసక్తికరంగా మారాయి.

పొత్తుల నిర్ణయం రాజకీయ సమీకరణాలకు సవాలు – మందపల్లి సర్పంచ్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయించడంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్‌లు చింతం విజయ కృష్ణ మోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ ఈ స్థానాన్ని ఆశించారు. ఇద్దరికీ గతంలో గ్రామ సర్పంచ్‌లుగా పనిచేసిన అనుభవం ఉండటంతో అభ్యర్థిత్వంపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. అయితే కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో పరిస్థితులు మారిపోయాయి. ఈ నేపథ్యంలో చింతం విజయ కృష్ణ మోహన్ టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీకి సిద్ధం కావడం గ్రామ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏళ్లతరబడి పంచాయతీ పాలన అనుభవమంమరోసారి ప్రజాక్షేత్రంలోకి రావాలనుకుంటున్నాను. అంటూ చింతం విజయ కృష్ణ మోహన్‌కు మందపల్లి పంచాయతీ రాజకీయాల్లో సుదీర్ఘ ప్రస్థానం ఉందని,గతంలో రెండుసార్లు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికవ్వగా, మరోసారి ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించానని, అదేవిధంగా రెండుసార్లు పర్సన్ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించానని,మొత్తంగా సుమారు 20 సంవత్సరాల పాటు పంచాయతీ పాలనలో వివిధ హోదాల్లో సేవలందించారని. గతంలో మందపల్లి దేవస్థానం ఛైర్మన్‌గా కూడా పనిచేశారని జగమెరిగిన సత్యం. ఈ సుదీర్ఘ అనుభవంతో మరోసారి సర్పంచ్‌గా గ్రామ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టాలని భావించిన ఆయనకు కూటమి సీట్ల సర్దుబాటు రూపంలో అనూహ్య పరిస్థితి ఎదురైంది. అయినప్పటికీ పోటీ నుంచి వెనక్కి తగ్గకుండా రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు నిర్ణయించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తొలి విడత ప్రచారానికి శ్రీకారం చుట్టేసాను – పోటీకి సిద్ధమైన చింతం విజయ కృష్ణ మోహన్ ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించగా, గ్రామంలోని ఓటర్లను కలుస్తూ తన అభ్యర్థిత్వాన్ని వివరిస్తున్నారు. గతంలో సర్పంచ్‌గా, పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేసిన అనుభవాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో మందపల్లిలో ఎన్నికల సందడి ముందుగానే మొదలైంది.రానున్న రోజుల్లో ప్రచారం మరింత వేడెక్కే అవకాశముందని కొన్ని మాటలు వినిపిస్తున్నాయి.

కూటమిలో కలవరం బండారుకు సవాల్‌గా మారిన మందపల్లి పరిణామం – కూటమి పొత్తులో జనసేనకు కేటాయించిన స్థానంలో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగుతుండటంతో ఈ పరిణామం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిస్థితిని టీడీపీ, జనసేన నాయకత్వాలు ఎలా సమన్వయం చేస్తాయి? రెబల్ అభ్యర్థిత్వంపై పార్టీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? స్థానిక నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదురుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈ రాజకీయ పరిణామాన్ని ఎలా చక్కదిద్దుతారన్నది చర్చనీయాంశంగా మారింది. చిన్న పంచాయతీ అని తక్కువ అంచనా వేసారా? సర్పంచ్ ఎన్నికలో కేవలం 1,010 మంది ఓటర్లు ఉన్న మందపల్లి పంచాయతీలో సర్పంచ్ ఎన్నిక ఇప్పుడు స్థానిక రాజకీయాల్లో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. ఒకవైపు కూటమి పొత్తులో జనసేనకు కేటాయించిన సర్పంచ్ స్థానం.. మరోవైపు 20 ఏళ్ల పంచాయతీ పాలన అనుభవంతో టీడీపీ రెబల్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న చింతం విజయ కృష్ణ మోహన్. ఇప్పటికే ప్రచారానికి శ్రీకారం చుట్టడంతో ఎన్నికల వేడి మొదలైంది. మరి ఈ రెబల్ అభ్యర్థిత్వం మందపల్లి రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపనుంది? కూటమి నాయకత్వం ఈ సమస్యను ఎలా పరిష్కరించనుంది? ఎన్నికల బరిలో చివరకు ఎవరెవరు నిలవనున్నారు? అన్నది వేచి చూడాల్సిందే.

చినవంక అభివృద్ధే లక్ష్యం.. మరోసారి అవకాశం కల్పించండి - దువ్వాడ హేమబాబు చౌదరి

- చినవంక సర్పంచ్ అభ్యర్థిగా దువ్వాడ హేమబాబు చౌదరి నామినేషన్
- ప్రజల ఆశీస్సులతో మరోసారి సేవ చేసే అవకాశం కల్పించండి



వజ్రపుకొత్తూరు,నవంబర్16 (సత్యదీపిక ఉదయం బ్యూరో): శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. ఈ నేపథ్యంలో కూటమి తరపున సర్పంచ్ అభ్యర్థిగా దువ్వాడ హేమబాబు చౌదరి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు పర్యాయాలుగా తనను ఆదరించి గెలిపించిన చినవంక పంచాయతీ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. ప్రజల అభిమానం, ఆశీస్సులతో మరోసారి సర్పంచ్‌గా పోటీ చేసేందుకు నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. పార్టీలో ఏ స్థాయిలో ఉన్నా ప్రజల బిడ్డగానే ఉంటూ వారి సేవకు అంకితమవుతానని అన్నారు. గతంలో తన హయాంలో ప్రభుత్వ సహకారంతో పంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి వీధిలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేశామని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పెన్షన్స్ అందించేందుకు కృషి చేశానని వివరించారు. ఈసారి ప్రజలు తనకు మరో అవకాశం కల్పిస్తే అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు చినవంక పంచాయతీని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో రాజకీయ ప్రత్యర్థులు హుందాగా వ్యవహరించాలని, ఎలాంటి వివాదాలు, గొడవలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని కోరారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చినవంక పంచాయతీలో సర్పంచ్ ఎన్నికల నామినేషన్లతో రాజకీయ సందడి నెలకొనగా, ప్రజల ఆశీస్సులతో మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని దువ్వాడ హేమబాబు చౌదరి ఓటర్లను అభ్యర్థించారు.

నామినేషన్ వేసిన గంగనాపల్లి కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కుర్రా నాగేశ్వరరావు (నాగబాబు)



కాకినాడ రూరల్ నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ స్థానిక గంగనాపల్లి గ్రామంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కుర్రా నాగేశ్వరరావు (నాగబాబు) నామినేషన్ వేసినారు. గంగనాపల్లి నుండి కొవ్వాడ వరకు భారీ ఎత్తున ర్యాలీగా నామినేషన్ కు గ్రామ ప్రజలు మరియు గ్రామ పెద్దలు మద్దతుగా నిలిచినారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 12 గంటలకు గంగనాపల్లి గ్రామము నుండి కొవ్వాడ గ్రామంలో ఎన్నికల అధికారికి నామినేషన్ దాఖలు చేసినారు. గంగనాపల్లి ప్రజల మనిషి అయిన నాగబాబు సర్పంచ్ అభ్యర్థికి ప్రతి ఒక్కరూ నిరాజనాలు , హారతులు పట్టినారు.కూటమి ప్రభుత్వానికి సపోర్ట్ చేస్తామని కనుకనే తమరు అందరూ భారీ ఎత్తున నామినేషన్ ప్రక్రియలో పాల్గొంటున్నామని ప్రతి ఒక్కరూ చేతులు జోడించి నాగబాబు కే మా ఓటు వేసి అఖండ విజయం చేకూరుస్తామని పత్రిక పూర్వకంగా మాట్లాడుతూ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అందరూ పాల్గొన్నారు.

అట్టహాసంగా వైసీపీ పార్టీ 10వ వార్డు అభ్యర్థి తెల్లం తిరుపతమ్మ నామినేషన్ దాఖలు



జీలుగుమిల్లి నవంబర్ 16:– (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామ పంచాయతీ 10వ వార్డు అభ్యర్థిగా వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు నాయకులు కార్యకర్తలు బలపరిచిన తెల్లం తిరుపతమ్మ సోమవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 10వ వార్డు ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దర్భగూడెం 12వ వార్డు అభ్యర్థిగా కొండపల్లి సునీత నామినేషన్

వైసీపీ పార్టీ తరపున ఎన్నికల బరిలోకి.. నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన వైసీపి నాయకులు, కార్యకర్తలు



జీలుగుమిల్లి నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) ఏలూరు జిల్లా జీలుగు మిల్లి మండలం దర్భగూడెం గ్రామ పంచాయతీ 12వ వార్డు అభ్యర్థిగా వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు బలపరిచిన అభ్యర్థి కొండపల్లి సునీత సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సందడి నెలకొంది. ఈ నామినేషన్ కార్యక్రమానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభ్యర్థికి మద్దతుగా నిలుస్తూ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12వ వార్డు అభివృద్ధి కోసం వార్డులో ఉన్న సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరవేయడం కోసం మీ ఆడబిడ్డ గా 12వ వార్డు అభ్యర్థిగా నిలబడటం జరిగిందని గత వైసిపి పార్టీ పరిపాలనలో ప్రజలు సంక్షేమ పథకాలు పొంది ప్రతి ఇల్లు అభివృద్ధి పథంలో ముందుకు నడిచిందని కొల్లూరి రాంబాబు నాయకత్వంలో గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని పనులు చేయడం జరిగిందని ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని వాటిని చేయడానికి వైసీపీ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న తెల్ల వెంకటేశ్వరరావును 12వ వార్డు అభ్యర్థిగా పోటీ చేయుచున్న కొండపల్లి సునీత అనే నన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలలో విద్యార్థుల ప్రతిభ!



ముమ్మిడివరం, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం విలేఖరి): భారత రాజ్యాంగ విలువలు మరియు ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ముమ్మిడివరం నియోజకవర్గ స్థాయి రాజ్యాంగ దినోత్సవ పోటీలను స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం మరియు క్విజ్ విభాగాలలో నిర్వహించిన పోటీలలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మరియు తాళ్ళరేవు మండలాల నుండి పలువురు విద్యార్థిని, విద్యార్థులు తమ మార్గదర్శక ఉపాధ్యాయులతో కలిసి పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. ముమ్మిడివరం మండల విద్యాశాఖ అధికారి-2 ఉదయభాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. పరిమళ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలలో లక్ష్మీవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఏ.వి.కే. ప్రవల్లిక మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, అయినాపురం ఉన్నత పాఠశాలకు చెందిన జి. నాగ సత్య రెండవ స్థానంలో, కేశనకుర్రు ఉన్నత పాఠశాల విద్యార్థిని సిహెచ్. యశస్విని మూడవ స్థానంలో నిలిచి నియోజకవర్గ స్థాయి విజేతలుగా ఘనవిజయం సాధించారు.

గ్రంథాలయాలు విద్యార్థులకు మధ్య అవినాభావ సంబంధం - కొత్తపేట డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు



కొత్తపేట, నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) – గ్రంథాలయాలు, విద్యార్థులకు మధ్య అవినాభావ సంబంధం ఉందని కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన, పోటీ పరీక్షల అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డా. రాజు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరై ప్రదర్శనలో ఉంచిన వివిధ విభాగాలకు చెందిన పుస్తకాలు, విజ్ఞాన గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు, ఇతర అధ్యయన సామగ్రిని ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో గ్రంథాలయాలకు, పుస్తక పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. పుస్తకాలు మనిషికి విజ్ఞానాన్ని. వివేకాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని, పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను చదివే అలవాటును విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు, వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి కళాశాల గ్రంథాలయంలో ప్రత్యేకంగా పోటీ పరీక్షల అధ్యయన కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, ఎస్ఎస్ సి, బ్యాంకింగ్, రైల్వే, పోలీస్ నియామక పరీక్షలు, ఇతర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, తాజా జనరల్స్, మాసపత్రికలు, వారపత్రికలు, ప్రస్తుత అంశాలకు సంబంధించిన సమాచార పుస్తకాలు మరియు అవసరమైన అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. విద్యార్థుల పోటీ పరీక్షల సన్నద్ధతను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఖరీదైన కోచింగ్ సెంటర్లపై ఆధారపడకుండా కళాశాల గ్రంథాలయంలోలభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు కొంత సమయాన్ని పోటీ పరీక్షల తయారీకి కేటాయిస్తూ, దినపత్రికలు, మాసపత్రికలు, జనరల్స్ చదవడం ద్వారా సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించు కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్చార్జి డి.సి.హెచ్. పాపారావు, కళాశాల లైబ్రేరియన్ ఎన్.వి.వి. జానకిరామ్, ఐక్యూ కోఆర్డినేటర్ డా. జి. శ్రీనివాసులు, గ్రంథాలయ కమిటీ సభ్యులు డా. కె. సత్యనారాయణ, వి. సిద్ధార్థకుమార్ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



ఏలూరు నవంబర్ 16:– (సత్య దీపిక ఉదయం ప్రతినిధి) స్థానిక జిల్లా కలెక్టరేటు ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను సోమవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవిఎం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను, ఈవిఎం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అధికారులతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవిఎం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవిఎం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.రవీందర్, ఎన్నికల విభాగం సిబ్బంది నాయక్, ప్రభృతులు పాల్గొన్నారు.

గంగనాపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ముమ్మిడి సుభాష్



కాకినాడ రూరల్ నవంబర్ 16 (సత్య దీపిక ఉదయం): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ స్థానిక గంగనాపల్లి గ్రామము నుండి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న ముమ్మిడి వి.వి సుభాష్ సర్పంచ్ అభ్యర్థిగా కొవ్వాడ గ్రామంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేసినారు. ముమ్మిడి సుభాష్ మాట్లాడుతూ గంగనాపల్లి గ్రామంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఎల్లప్పుడూ అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ప్రజల సేవలో నిమగ్నమై ఉంటానని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతానని గంగనాపల్లి ప్రజలు నన్ను నమ్మి నాకు ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని ఓటర్లు తమకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని పత్రికాపూర్వకంగా మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషులు,మిత్రులు, అభిమానులు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు మరియు ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

